క్లుప్తంగా

ఘనంగా గురుకులం వార్షికోత్సవం



పిరమిడ్ విన్యాసం చేస్తున్న విద్యార్థులు

కొత్తపల్లి: మండలంలోని గోకవరం గ్రామంలో ఉన్న భక్తకన్నప్ప గురుకులం ఆవాస వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. వెలుగోడు ఎంపీపీ లాలం రమేష్, క్షేత్ర సేవా ప్రముఖ్ ఎక్కా చంద్రశేఖర్, ఆవాస కమిటీ అధ్యక్షులు కోట్ల ప్రభాకర్ రెడ్డి, కార్యదర్శి రఘురాములు పాల్గొన్నారు. విద్యార్థుల కోలాటం, భజన, సూర్య నమస్కార పిరమిడ్లు అలరించాయి. దేశభక్తి పాటల ద్వారా, స్వామి వివేకానంద ఏకపాత్రాభినయం ద్వారా, ఆదర్శ గ్రామం యోజనలో భాగంగా వివిధ నాటకాలు ప్రదర్శించారు.

మహానందీశుడి దంపతులకు ఏకాంతసేవ

మహానంది: మహానందిలో కొలువైన కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులకు ఆదివారం రాత్రి ఏకాంతసే పూజలు నిర్వహించారు. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు శాంతారాంభట్ స్థానిక యాగశాలలో స్వామి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు ఆర్జిత సేవా టికెట్ల ద్వారా ఏకాంతసేవ పూజల్లో పాల్గొన్నారు. పూజల అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

మహానందీశుని భక్తులకు పార్కింగ్ కష్టాలు

- ఆలయం ఎదుటే వాహనాల నిలిపివేత



ఆలయం ఎదురుగా నిలిపిన భక్తుల కార్లు

మహానంది: మహానంది ఆలయానికి వచ్చే భక్తులకు పార్కింగ్ కష్టాలు తప్పడం లేదు. ఏడాదికి రూ.కోట్లలో ఆదాయం వస్తుంది. దీనికి తోడు మహానందీశ్వరస్వామి దేవస్థానానికి వచ్చే కార్లు, జీపులు, లారీలు, బస్సులు, ఇతర వాహనాల నుంచి టోల్ గేటు రుసుము వసూలు చేస్తున్నారు. అయినా ఆలయం వద్దకు వచ్చేసరికి పార్కింగ్ ప్రదేశం లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆలయానికి ఇరువైపులా ఉన్న మాడవీధుల్లోనూ, మహాద్వారం వద్ద నిలుపుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. ఆలయానికి అడ్డంగా వాహనాలు ఉండటంతో సాధారణ భక్తులకు ఇబ్బందికరంగా మారుతోంది. రూ.300 కోట్లతో మాస్టర్‌ప్లాన్ అంటూ గొప్పలు చెప్పుకునే ప్రజాప్రతినిధులు, అధికారులు పార్కింగ్ వసతి కల్పించాలని పలు ప్రాంతాల భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

రైతు బిడ్డకు ఎస్ఐ ఉద్యోగం



ఎస్ఐగా ఎంపికైన సతీష్

వెలుగోడు: రైతు కుటుంబంలో జన్మించిన మాధవరం యువకుడు సతీష్ సబ్‌ఇన్‌స్పెక్టర్(ఎస్ఐ)గా ఉద్యోగం సాధించారు. మండల పరిధిలో ని మాధవరం గ్రామా నికి చెందిన రైతు మద్దెల సంజీవకుమార్ వ్యవసాయం కలిసి రాకపోయినా తన కుమారుడు సతీష్‌ను బాగా చదివించాడు. తండ్రి కలలను నిజం చేస్తూ సతీష్ అనంతపురం పోలీసు శిక్షణ కళాశాలలో ప్రాథమిక శిక్షణ పూర్తి చేసుకొని, సత్యసాయి జిల్లాలో సబ్‌ఇన్ స్పెక్టర్‌గా పోస్టింగ్ పొందారు. దీంతో గ్రామస్తులు, స్నేహితులు, బంధువులు సతీష్‌ను అభినందించారు.

పునాదులకే పరిమితం

- త్వరగా పూర్తి చేయాలని కోరుతున్న గ్రామస్తులు



పునాదులకు పరిమితమైన ఆలయ నిర్మాణం

జూపాడుబంగ్లా: మండలంలోని రామసముద్రం గ్రామంలో వెంకటేశ్వరస్వామి ఆలయం మూడు మాసాలైనా నిర్మాణానికి నోచుకోకపోవటంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఉన్న పురాతన వెంకటేశ్వరస్వామి ఆలయం కూల్చి నూతన ఆలయానికి మూడు మాసాల క్రితం దేవదాయశాఖ అధికారులు భూమిపూజ చేశారు. నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతుండటంతో పూజలు చేసుకునే అవకాశం లేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 18 ఎకరాల మాన్యం భూములున్న వెంకటేశ్వరస్వామి ఆలయం శిథిలం కావటంతో దేవదాయశాఖ రూ.36 లక్షల సీజీఎఫ్ నిధులను మంజూరు చేసింది. నూతన ఆలయ నిర్మాణ పనులను ముక్తా కన్‌స్ట్రక్షన్స్ వారికి అప్పగించారు. పనులను వేగవంతం చేసి త్వరగా ఆలయాన్ని పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రాణాలు తీసిన అధికారుల నిర్లక్ష్యం

- అధికారుల నిర్లక్ష్యంతో ఆత్మకూరులో లోపించిన పారిశుద్ధ్యం
- అతిసార ప్రబలి ముగ్గురి మృతి
- మరో నలుగురు ఆస్పత్రి పాలు

పారిశుద్ధ్య పనులు చేయించేనాథుడే లేరు.. తాగునీటి శుద్ధి సంగతి దేవుడెరుగు. ఫలితంగా ఆత్మకూరు పట్టణంలో అతిసార వ్యాధి విజృంభించింది. అధికారులు పర్యవేక్షణను గాలికిదిలి నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ముగ్గురి ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. మరో నలుగురు ఆస్పత్రిపాలయ్యారు. అనధికారికంగా పదుల సంఖ్యలో వాంతులు విరేచనాలతో ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు సమాచారం.

– ఆత్మకూరు

ఆత్మకూరు పట్టణంలో అతిసారా వ్యాధి బాధితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతూనే ఉంది. గొల్లపేట, నీలితొట్టి వీధుల్లో రెండు రోజులక్రితం షేక్‌బషీరున్, రహంతుల్లాలు మృతిచెందగా, ఆదివారం రామచంద్రనాయక్ కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. కాగా మరో నలుగురు అస్వస్థతకు గురికావడంతో ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పట్టణంలో అతిసారా వ్యాధి సోకి ఇలా మృత్యువాత పడుతూ ఉన్నా అధికారులు మాత్రం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని పట్టణ వాసులు ఆరోపిస్తున్నారు.

ట్యాంకుల శుభ్రం ఎప్పుడో..

రక్షిత మంచినీటి ట్యాంకులను శుభ్రం చేసిన దాఖలాలు కనిపించడం లేదు. నిబంధనల ప్రకారం ప్రతి 15 రోజులకోసారి ట్యాంకర్లను శుభ్రం చేసి నీటిని సరఫరా చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. కానీ పట్టణంలోని ట్యాంక్‌లను ఎప్పుడు శుభ్రం చేశారో మున్సిపల్ అధికారులకే గుర్తు లేదు. కనీసం నీటిని కూడా క్లోరినేషన్ చేయడం లేదు. ఇక యేళ్ల క్రితం వేసిన పైపులైన్లు కావడం, అవి కూడా భూగర్భంలో ఎనిమిది అడుగుల లోతులో ఉండడంతో రంధ్రాలు పడి మురుగునీరు కలుస్తున్నట్లు ఆరోపణలున్నాయి. పర్యవేక్షించాల్సిన అధికారులు కూడా పట్టించుకోవడంతో సిబ్బంది ఆడిందే ఆట పాడిందే పాటలా తయారైంది. వీరి నిర్లక్ష్యానికి ముగ్గురు మృత్యువాత పడగా మరికొందరు చికిత్స పొందుతున్నారు.

పేరుకుపోయిన చెత్త నిల్వలు

చెత్తను తరలించేందుకు ఎలాంటి డంపింగ్ యార్డు లు లేకపోవడంతో పట్టణంలో ఎక్కడ పడితే అక్కడ చెత్తను నిల్వ చేయడంతో దుర్వాసన వెదజల్లడంతోపాటు అంటు వ్యాధులు ప్రబలుతున్నాయి. ఇదే విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునేనాథుడే లేరనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి డంపింగ్ యార్డులు ఏర్పాటు చేసి చెత్తను తరలించాలని పట్టణ వాసులు కోరుతున్నారు. అలాగే అతిసారా వ్యాధి సోకినప్పటికీ కమిషనర్ సత్వర చర్య లు చేపట్టకపోవడంతోనే ముగ్గురు మృతిచెందారు. అర్ధరాత్రి కాలనీలో బ్లీచింగ్ పౌడర్, సున్నం చల్లించి చేతులు దులుపుకున్నారు. ఆగమేఘాలపై రాత్రివేళ రోడ్ల వెంట ప్రవహించే మురుగు కాలువల్లో చెత్తాచెదారాన్ని తొలగించారు కానీ ముందుగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన మున్సిపల్ కమిషనర్‌ను సస్పెండ్ చేయాలనే డిమాండ్ ప్రజల నుంచి వ్యక్తమవుతోంది.



రక్షిత మంచినీటి ట్యాంకును సీజ్ చేసిన అధికారులు

డ్రెయినేజీ అస్తవ్యస్తం

ఆత్మకూరు పట్టణంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. డ్రెయినేజీల్లో మురుగునీరు నిల్వ ఉండి దోమలు, ఇతర అంటువ్యాధులకు కారణమవుతున్నాయి. కనీసం డ్రెయినేజీలను వారానికి ఒకటి, రెండుసార్లు కూడా శుభ్రం చేసే దాఖలాలు కనిపించకపోవడంతో రోజురోజుకు చెత్తాచెదారం నిండి డ్రెయినేజీలు అధ్వానంగా మారాయి. కనీసం నిండిన చోట మున్సిపల్ అధికారులు, సిబ్బంది ద్వారా పక్కకు పంపించకపోవడంతో కాలనీల్లో మురుగునీరు ప్రవహిస్తున్నాయి. 15 రోజుల క్రితం నీలితొట్టె వీధిలో తాగునీటి కుళాయిల్లో నీరు దుర్వాసన రావడంతో కొందరు స్థానికులు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. దీంతో నీరు కలుషితమవడంతో అతిసారా వ్యాధి ప్రబలిందనే ఆరోపణలు ఉన్నాయి.

ట్యాంకులను శుభ్రం చేయాలి



రక్షిత మంచినీటి ట్యాంకర్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి. నెలలు, సంవత్సరాల తరబడి ట్యాంకర్లను శుభ్రం చేయకపోవడం పద్ధతి కాదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిబంధనల ప్రకారం ట్యాంకులను శుభ్రం చేయించాలి.

– రామునాయక్, ఆత్మకూరు

పారిశుద్ధ్య పనులు చేపట్టండి



పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడంతో అతిసారా వ్యాధి వ్యాప్తి చెందింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుద్ధ్య పనులు చేపట్టాలి. చెత్తాచెదారాన్ని పట్టణానికి దూరంగా తరలించాలి. దోమలను నివారించాలి.

– ముర్తుజావలి, ఆత్మకూరు



పట్టణంలో నీటితో నిండిన మురుగు కాలువలు

అధికారులను సస్పెండ్ చేయాలి

ఆత్మకూరు: అతిసారా ప్రబలి ఇద్దరు మృతిచెందిన ఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన మున్సిపల్ కమిషనర్, డీఎంహెచ్‌ను సస్పెండ్ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.రంగనాయుడు, నాయకులు ఎం.రమేష్ బాబు, తాలూకా కార్యదర్శి టి.ప్రతాప్ డిమాండ్ చేశారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడారు. నాలుగు రోజుల క్రితం ఆత్మకూరు పట్టణంలో అతిసారా ప్రభావం ఉందని తెలిసినా డీఎంహెచ్ఓ నిర్లక్ష్యం చేస్తూ ఉన్నతాధికారులకు తప్పుడు నివేదికలు అందించారన్నారు. పట్టణ శానిటేషన్, తాగునీరు పరీక్షించి ప్రజలను కాపాడాల్సిన మున్సిపల్ కమిషనర్ కూడా పూర్తిగా విఫలం చెందారన్నారు. 200 మంది మున్సిపల్ సిబ్బంది ఉండాల్సిన చోట 100 మంది కూడా లేరన్నారు. సాక్షాత్తూ జిల్లా కలెక్టర్, జిల్లా అధికారులు ఆత్మకూరు పట్టణానికి వచ్చినా మృతుల కుటుంబాలను పరామర్శించకపోవడం తగదన్నారు. ప్రత్యేకాధికారితో విచారించి మృతుల కుటుంబాలకు రూ.50 లక్షలు చొప్పున పరిహారం అందించాలన్నారు. సమావేశంలో సీపీఐ నాయకులు ప్రతాప్, వెంకటశివుడు, అహ్మద్‌హుసేన్, ఏఐటీయూసీ పట్టణ నాయకులు చాంద్ బాషా, లాల్, షేక్షావలి, ఖాదర్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ఉద్యమించాలి

కొత్తపల్లి: ప్రజా సమస్యలపై ఉద్యమించాలని ఎంసీటీఐ(యూ) జిల్లా కన్వీనర్ లాజరస్, ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర కన్వీనర్ నక్కా చిన్నకుమార్ అన్నారు. ఆదివారం సంగమేశ్వరంలో ఎంసీపీఐ నందికొట్కూరు డివిజన్ ఆవిర్భావ మహాసభ నిర్వహించారు. అనంతరం డివిజన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా మద్రిస్వామి, సహాయ కార్యదర్శిగా శ్రీనివాసులు, ట్రెజరర్‌గా సౌమ్య, డివిజన్ కమిటీ సభ్యులుగా మేరమ్మ, క్రిష్ణ, స్వామిదాసులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు లచ్చన్న, రాముడు, తిక్కస్వామి పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చండి



మాట్లాడుతున్న విజయ్‌కుమార్

జూపాడుబంగ్లా: ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా ప్రశ్నించే వారిపై జులుం ప్రదర్శిస్తూ ప్రజలను భయాందోళనకు గురిచేడం సిగ్గుచేటని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు విజయ్‌కుమార్ విమర్శించారు. ఆదివారం ఆయన పారుమంచాల గ్రామంలో విలేకరులతో మాట్లాడారు. తల్లికి వందనం, రైతులకు పెట్టుబడి సాయం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తదితర హామీలు ఇచ్చి అధికారం చేపట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తొమ్మిది నెలలవుతున్నా అమలు చేయకపోవడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. ఖరీఫ్, రబీ సీజన్లు ముగియవస్తున్నా రైతులకు పైసా ఇచ్చిన దాఖలాల్లేవన్నారు. రబీ పంటలు వర్షాభావ పరిస్థితుల వల్ల దెబ్బతిని దిగుబడిలేక రైతులు తీవ్రంగా నష్టపోయినా ఆదుకోవడంలో విఫలమయ్యారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించారన్నారు. ప్రస్తుత సీఎం చంద్రబాబునాయుడు కేవలం అధికార పార్టీ నాయకులకు మాత్రమే సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని పేర్కొనటం విడ్డూరంగా ఉందన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అనిల్‌కుమార్, నాగరత్నం, మహేష్‌నాయుడు, స్వామిదాసు, భరత్‌కుమార్‌రెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ హామీలకు బడ్జెట్ ఏది?

నందికొట్కూరు: సూపర్ సిక్స్ హామీలను అమలు చేసేందుకు బడ్జెట్‌లో కేటాయింపులు ఎక్కడని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు ప్రశ్నించారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే సంపద సృష్టించి ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తామని చెప్పిన చంద్రబాబు సీఎం అయిన తర్వాత హామీలకు ఎగనామం పెట్టారన్నారు. తొమ్మిది నెలలవుతున్నా రాష్ట్రంలో ఉద్యోగాల సంగతే లేదన్నారు. మహిళలకు ఉచిత బస్సు, రూ.1,500, తల్లికి వందనం, రైతులకు అన్నదాత సుఖీభవ, దీపం పథకాలకు కోత పెట్టడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు ఏసన్న, సుధాకర్, బీబీ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ద్వారా ఆటో గుర్తింపు



బాధితురాలికి బ్యాగును అందజేస్తున్న టౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

నందికొట్కూరు: ప్రయాణికురాలు మరిచిపోయిన బ్యాగ్ ఉన్న ఆటోను పోలీసులు సీసీ కెమెరాల సాయంతో గుర్తించారు. ఆటోను స్టేషన్‌కు తరలించి బాధితురాలికి బ్యాగ్‌ను అప్పగించారు. టౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాలు.. సంగయ్యపేటకు చెందిన సరోజమ్మ స్థానిక సూపర్ మార్కెట్ వద్ద శనివారం మధ్యాహ్నం ఆటో ఎక్కి సంగయ్యపేటకు వెళ్లింది. ఆటో దిగి రెండు బ్యాగుల్లో ఒక బ్యాగును తీసుకొని ఇంట్లోకి వెళ్లింది. ఆటో డ్రైవర్ నాగన్న బ్యాగును చూసుకోకుండా వెళ్లిపోయాడు. బాధితురాలు ఇంట్లో నుంచి బయటకు వచ్చేలోపు ఆటో కనపడకపోవడంతో పోలీసులను ఆశ్రయించింది. మరోవైపు బ్యాగును చూసుకున్న ఆటో డ్రైవర్ పోలీసులకు ఇవ్వకుండా తన ఇంటికి తీసుకెళ్లాడు. దీంతో పోలీసులు ఆటోను సీసీ కెమెరాల ద్వారా గుర్తించి స్టేషన్‌కు తీసుకొచ్చారు. సీఐ ప్రవీణ్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో విచారించి బాధితురాలికి బ్యాగు, అందులో ఉన్న బంగారు నల్లపూసల దండను ఆదివారం అప్పగించారు.

నేటి నుంచి పశువులకు టీకాలు

బండి ఆత్మకూరు: పశువులకు సోమవారం నుంచి 21వ తేదీ వరకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు మండల వెటర్నరీ డాక్టర్లు అనూష, గౌసియా తెలిపారు. ఆదివార వారు మాట్లాడుతూ 3న బండిఆత్మకూరు, బి.కోడూరు, 4న యర్రగుంట్ల, 5న ఈర్నపాడు, బోధనం, 6న పెద్ద దేవళాపురం, 7న పరమటూరు, వెంగళరెడ్డి పేట, 8న సంత జూటూరు, 10న పార్నపల్లి, చిన్న దేవళాపురం, 11న నారాయణాపురం, 12న లింగాపురం, 13న జి.సి.పాలెం, 15న కాకనూరు, 17న శింగవరం, 18న సోమయాజులపల్లి, 19న మణికంఠపురం, 20న రామాపురం, 21న ఓంకారంలో పశువులకు టీకాలు వేయనున్నామన్నారు.

అమ్మవారికి పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబామల్లికార్జున స్వామి వార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ నిర్వహించారు. ముందుగా ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉత్సవమూర్తులు ఆశీనులు గావించి వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు చేసి, మేళతాళాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు.



భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు

పాములపాడు: స్థానిక చౌడేశ్వరి ఆలయం వద్ద భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయక, సుబ్రహ్మణ్యేశ్వర సహిత చౌడేశ్వరి దేవి నూతన ఆలయం విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఆదివారం పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా పురోహితుల మంత్రోచ్చారణలతో ప్రధాన దేవత, స్వరతోభద్ర, మండల వాస్తు నవగ్రహ, గణపతి, చండీ, దీక్ష హోమాలు, అమ్మవారి వార్షికోత్సవ అభిషేకం, కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం మహా మంగళహారతి ఇచ్చారు. సాయంకాలం ప్రదోష పూజ, లలితా సహస్రనామ పారాయణం, ఆదివాసములు, ధాన్యాధివాసము, వేద స్వస్తి మహా మంగళ హారతి, తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించారు.



యాగం నిర్వహిస్తున్న భక్తులు

రైతన్నల నోట్లో కారం

- ఒక వైపు తెగుళ్లు .. మరో వైపు గిట్టుబాటు కాని ధర
- తీవ్రంగా నష్టపోయిన మిర్చి రైతులు
- దిగుబడులూ అంతంతే
- పెట్టుబడి చేతికందక ఆందోళనలో అన్నదాత



తాలు కాయలు ఏరుతున్న కూలీలు

నందికొట్కూరు: మిర్చి పంట రైతన్నల నోట్లో కారం కొట్టింది. ఒక వైపు తెగుళ్లు.. మరో వైపు గిట్టుబాటు కాని ధరతో అన్నదాతలు అప్పుల పాలవుతున్నారు. వాతావరణ అనుకూలించక తెగులు ఉధృతితో కాయ నాణ్యత దెబ్బతింది. గతేడాది క్వింటా మిర్చి ధర రూ.10 వేలు పలకటంతో రైతులు ఎంతో ఆశగా ఈ ఏడాది మిర్చి పంట సాగు చేపట్టారు. దీనికి తోడు తొలకరిలో సమృద్ధిగా వర్షాలు కురవటంతో అప్పుల ఊబి నుంచి బయటపడాలనే కొండంత ఆశతో రైతులు ఎక్కువ మొత్తంలో మిర్చి సాగు చేశారు. పెట్టిన పెట్టుబడులు రాక రైతులు తీవ్రంగా నష్టపోయారు. మిర్చికి తెగులు ఉధృతిని అరికట్టేందుకు అప్పుతెచ్చి మరీ మందులు పిచికారీ చేసి పంటలను కాపాడుకునే ప్రయత్నం చేశారు. ఇది ఇలా ఉండగా వాతావరణం అనుకూలించక అకాల వర్షాల కారణంగా ఎక్కువ శాతం నాణ్యత లేని తాలు కాయలు వస్తున్నాయి. తెగుళ్ల ఒక వైపు, గిట్టుబాటు ధర లేకపోవడం మరో వైపు. ఒక ఎకరాకు 10 క్వింటాళ్ల దిగుబడిలో సుమారు 3 క్వింటాళ్లకు పైగా తాలు కాయలు వస్తుండటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. కూటమి ప్రభుత్వం మిరప క్వింటాకు మద్దతు ధర రూ. 20 వేలు ఇస్తే కనీసం పెట్టిన పెట్టుబడులు చేతికి వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. ఎకరా మిపర పంటకు రూ.1.50 లక్షలు ఖర్చు వచ్చిందని రైతులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం క్వింటాకు రూ.25 వేలు గిట్టుబాబు ధర కల్పించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గిట్టుబాటు ధరతోపాటు పరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

పెరిగిన తాలు కాయలు

వాస్తవానికి ఎకరాకు 25 క్వింటాళ్లకు పైగానే దిగుబడి వస్తే రెండు, మూడు క్వింటాళ్ల వరకు తాలు కాయ వచ్చేంది. ఈ ఏడాది ఎకరాకు మూడు నుంచి నాలుగు క్వింటాళ్ల వరకు తాలు కాయ వస్తోంది. ఎర్ర మిర్చి రూపంలో అమ్మితే క్వింటాకు రూ.10 వేలు ధర పలకడం లేదు. ప్రస్తుతం తాలు కాయ రూ.5 వేల ధర పలుకుతుంది. దీంతో క్వింటాకు రూ.10 వేల వరకు నష్టం వస్తోంది. ఈ లెక్కన ఎకరాకు రూ.50 వేల వరకు రైతు నష్టపోతున్నాడు.

ఈ ఏడాది నందికొట్కూరు నియోజకవర్గంలో ఖరీఫ్-1100 నందికొట్కూరు ఖరీఫ్-177, రబి-24, మిడుతూరు ఖరీఫ్-377, పగిడ్యాల ఖరీఫ్-69, రబి-04, జూపాడుబంగ్లా-280, పాములపాడు-162, కొత్తపల్లి ఖరీఫ్-35 హెక్టార్లలో మిరప పంటను రైతులు సాగు చేశారు. రబిలో 28 హెక్టార్లలో సాగు చేశారు. ఒక్కో ఎకరాకు రూ.లక్ష వరకు రైతులు పెట్టుబడులు పెట్టారు. నెల రోజులుగా మిర్చి కోతలు చేపట్టారు. మిరప కోత, గ్రేడింగ్‌లు ఖర్చులు అదనంగా వెచ్చించాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి తోడు ప్రస్తుతం క్వింటా మిర్చి ధర సన్నరకానికి ఒక రేటు, ఇతర రకాలకు మరో రేటు తగ్గించి ప్రకటించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

పెట్టుబడి కూడా వచ్చేలాలేదు



ఏడు ఎకరాల్లో మిరప పంటను సాగు చేశాను. తెగుళ్ల సోకడంతో మూడు ఎకరాల పంట బాగా దెబ్బతిన్నడంతో చెడగొట్టాను. ఎకరాకు రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు పెట్టుబడి అయ్యింది. 10 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. అందులో రెండు క్వింటాళ్లకు పైగా తాలు కాయ ఉంది. ప్రస్తుతం క్వింటా ధర రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు పలుకుతుంది. ఎంతో ఆశతో మిరప పంటను సాగు చేశా. తీరా పంట చేతికి వచ్చే సమయానికి ధర తగ్గటంతోపాటు కాయ నాణ్యత లేకపోవటం ఏమి చేయాలో తెలియడం లేదు. గుంటూరు మార్కెట్‌కు తీసుకెళ్తే లారీ బాడుగకు కూడా సరిపోదు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరకు కొనుగోలు చేయాలి.

– పుల్లయ్య రైతు, పాములపాడు

ఖర్చులు పెరిగాయి



ఐదు ఎకరాల్లో మిరప సాగు చేశాను. ఎకరాకు విత్తనం నుంచి పంట కోత కోసే వరకు రూ.1.50 లక్షల వరకు ఖర్చు వచ్చింది. ఐదు ఎకరాలకు రూ.7.50 లక్షల వరకు భారీ ఖర్చు వచ్చింది. వర్షాలకు తెగుళ్ల సోకి పంట పూర్తిగా దెబ్బతింది. ఈ ఏడాది తెగుళ్ల ఉధృతిని అరికట్టేందుకు మందుల పిచికారీకి బాగా ఖర్చయ్యింది. ఎకరాకు 10 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. క్వింటా ధర రూ.11 వేల నుంచి రూ.12 వేల వరకు పలుకుతుంది. ఎకరాకు ఈ తాలు కాయ మూడు నుంచి నాలుగు క్వింటాళ్ల వరకు వస్తుంది. ఎకరాకు రూ.30 వేలకు పైగా నష్టపోవాల్సి వస్తోంది. ఊరిలోనే కేజీ రూ.100 నుంచి రూ.120 వరకు విక్రయిస్తున్నాం. కూటమి ప్రభుత్వం మద్దతు ధర కల్పించలేదు. పెట్టిన పెట్టుబడుల కోసం తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు.

– మల్లేశ్వరరెడ్డి, చింతలపల్లి గ్రామం, మిడుతూరు మండలం

సత్ప్రవర్తనతో మెలగండి

పాములపాడు: ప్రతి ఒక్కరూ గ్రామాల్లో సత్ప్రవర్తనతో మెలగాలని ఎస్ఐ సురేష్‌బాబు సూచించారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి గొడవలకు వెళ్లవద్దని సూచించారు.

ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

నందికొట్కూరు: ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రఘురామ్మూర్తి హెచ్చరించారు. ఆదివారం మున్సిపల్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలంటూ ఈనెల 4న రాష్ట్ర వ్యాప్తంగా ధర్నా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి

ఆత్మకూరు: శ్మశానంలో గుంతలు తీసే బేగరీలు, కాటి కాపర్లను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి (కేవీపీఎస్) జిల్లా సహాయ కార్యదర్శి మేకలరాజు, జిల్లా నాయకులు భాస్కర్, సంపత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సమితి కార్యాలయంలో వారు మాట్లాడారు. గడ్డపార, రెండు చెలిక పారలు, రెండు గంపలు, బ్లౌజులు, డ్రస్సులతో పాటు పింఛన్ ఇవ్వాలన్నారు. శ్మశానంలో పనిచేసే వృత్తిదారులందరికీ ప్రమాదబీమా, ఆరోగ్యబీమా సౌకర్యం కల్పించాలన్నారు. వృత్తిదారుల పిల్లలకు ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఉచిత విద్యను అందించాలన్నారు. బేగరీలు, కాటి కాపర్ల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 11న చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపడుతున్నామని, పెద్ద సంఖ్యలో బేగరీలు, కాటికాపర్లు తరలిరావాలని వారు కోరారు.